ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా! లోకములో మనము అన్నగత ప్రాణులము. అది లేక క్షణమైనకూడను జీవించలేము. అన్నము ఎక్కడనుండి వస్తున్నది? అనంతమైన, అద్వితీయమైన, అవాఙ్మానస గోచరుడైన శంకరుని నుండియే ఆవిర్భవించుచున్నది. ప్రపంచములో కనిపించు సమస్త వస్తువులు కూడను భగవంతునియొక్క సృష్టియే. భూత, భవిష్యత్, వర్తమానములో కనిపించేవన్నికూడను దైవసృష్టియే. ఆ సత్యాన్ని గుర్తించుకున్నటువంటిది ఒక్క పార్వతి మాత్రమే. అందరు దేవతలు వచ్చి ఆమెతో అన్నారు,

**'నీవు బాలవే కద గౌరమ్మా**
**సాంబశివుడు ముసలివాడమ్మా**
**తలనిండా జడలవాడమ్మా**
**తాను కట్టింది పులిచర్మమమ్మా**
**ఎద్దు వాహనమెక్కుతాడు**
**ఏ ప్రొద్దూ తిరుగుచుండువాడు**
**పుట్టలోని పాములు చుట్టుకున్నాడమ్మా**
**గుట్టు తెలియక నీవెట్లు వరించితివి?**
**ఒక ఇల్లు లేదు, వాకిలి లేదు**
**ఒలుకుల్లో పడుకుంటాడు'**

'ఇంతమాత్రం నీవు గుర్తించుకోలేకపోతివా? అట్లాంటివాడిని నీవెట్లా పెండ్లి చేసుకుంటున్నావు?' అని ప్రశ్నించారు. అప్పుడు పార్వతి నవ్వుతూ చెప్పింది, 'బాహ్యస్వరూపాన్ని మాత్రమే చూసి మీరు అదే సత్యమని భ్రమిస్తున్నారు. అభౌతికమైన, అలౌకికమైన, శాశ్వతమైన తత్త్వమును గుర్తించకుండా దేహమునకు, మనస్సుకు, బుద్ధికి పరిమితమైన దృష్టితో మీరు అందచందములను, ఆస్తిపాస్తులను చూస్తున్నారు. కనుక, మీకు అవే కనిపిస్తున్నాయి. లోనున్నటువంటి సూక్ష్మమైన స్వరూపాన్ని మీరు గుర్తించటం లేదు. అదే దైవత్వము. అతను దేహము కాదు, మనస్సు కాదు. లింగాకారుడై ఉంటున్నాడు స్వామి. ఆ లింగము ఎవ్వరికీ కనిపించదు. అది అతని కంఠమందు ఉంటున్నది. అట్టి స్వరూపాన్ని గుర్తించినదానను నేను. కనుకనే, నేనతనిని వరిస్తున్నాను. బాహ్యరూపము మాత్రమే మీకు కొంతవరకు కనిపిస్తుంది. కాని, భగవంతుడు మీకు కనిపించే రూపానికి పరిమితం కాదు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అట్టి ఆకారమును మీరు గుర్తించినప్పుడు భౌతికమైన రూపాన్ని గురించి యేమాత్రము యోచించరు. 'సాంబశివుడు వృద్ధుడే! వృద్ధుడే! 'అని అనుకోరు. నా భర్త భిక్షమెత్తేవాడు కాదు. సర్వులకు భిక్షము పెట్టేవాడు' అన్నది. అప్పుడు శైలరాజేంద్రుడు ప్రత్యక్షమయ్యాడు. గౌరికంటె తాను చాలా చిన్నవాడుగా కనబడ్డాడు. ఈడు, జోడు చక్కగా సరిపోయింది. దేవతలందరూ ఆశ్చర్యపడ్డారు. ఈవిధంగా లోకులు భ్రమించేది ఒకటి, జరిగేది మరొకటి. అంతర్భూతమైన సత్యాన్ని అందరూ గుర్తించుకోలేరు.

భగవంతుని స్వరూపము అత్యంత సూక్ష్మమైనది. అది అణుస్వరూపమే. అదియే ఇది. (హస్తచాలనముచే ఒక లింగాన్ని సృష్టించారు) అది (ప్రధాన అర్చకుడు నిత్యం పూజించే లింగం) ఏవిధంగా ఉందో ఇది (సృష్టించిన లింగం) కూడా అదేవిధంగా ఉంది.

లోకులు కాకులు. అజ్ఞానాంధులై బాహ్యమైన ఆకారమును మాత్రమే చూస్తుంటారు. దైవత్వమును ఎవరుకూడను గుర్తించుకోలేరు. దైవత్వమునకు అర్పితం చేయవలసినది 'ఇట్టిది, అట్టిది' అని ఎవ్వరూ నిర్ణయించ లేరు. ఈనాడు చాలామంది ఆంగ్లభాషా ప్రవీణులు. ఆధునిక విద్యాంతులు. 'ఏమిటిది! ఎంతోమంది బీదలు అన్నం లేక అల్లాడిపోతుంటే ఇంత ధాన్యమును, ఇంత నెయ్యిని అగ్నిలో వేసి వ్యర్థం చేస్తున్నారే! దానికి బదులు బీదలకు అన్నం పెట్టవచ్చు కదా!' అంటారు. అటువంటి వారికి మన ప్రధాన అర్చకునివంటి వేదాంతులు బుద్ధి చెబుతారు. 'అయ్యా! ఈనాడు రైతు ఐదు

మూటల వడ్లను నీటిలో వేస్తున్నాడు. మొలకలు వచ్చిన తరువాత తీసుకుపోయి మట్టిలో చల్లుతున్నాడు. రైతు చేసేది మంచి పని కాదని ఎవరైనా చెప్పగలరా? వాటిని ఆ బురదలో చల్లటం వల్లనే కొన్ని రోజుల తర్వాత యాభై మూటల వడ్లను ఇంటికి తెచ్చుకోగల్గుతున్నాడు. అదేవిధముగా, మన ఋత్విక్కులు చేసే పూజలు, హోమాలు గొప్ప ఫలితము నందించునవేగాని వ్యర్థమైనవికావు. ఈనాడు భగవంతునికి అర్పితము చేసే ధాన్యము, నెయ్యి అంతాకూడను భవిష్యత్తులో ఎంతో గొప్ప ఫలితాన్నిస్తాయి. ఐదు మూటల వడ్లు మట్టిలో చల్లితే యాభై మూటలయినట్లుగా, అగ్నిహోత్రునికి ఆహుతి చేసిన సమస్త పదార్థములుకూడను ఎన్నో రెట్లు అధిక మవుతున్నాయి'.

మనము దైవానికి అర్పితము చేయవలసినది ఒక్కటే ఒక్కటి. మన హృదయములో అనేక ఆశలు చేరివున్నవి. ఈ కోరికలన్నీ భగవంతునికి అర్పితం చేయాలి. సర్వసంగ పరిత్యాగులమై ఎన్ని అర్పితం చేసినామో ఆ భావములన్నీ భవిష్యత్తులో ఎంతో గొప్ప ఫలితాన్ని అందిస్తాయి. కాని, ప్రాకృత మానవులు ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక బాహ్యమైన, లౌకికమైన విషయాలను మాత్రమే గుర్తిస్తూ వస్తున్నారు. దైవానికిచ్చిన ప్రతి ఒక్కటీ వెయ్యింతలై మనకు తిరిగి వస్తుంది.

లోకుల దృష్టి బాహ్యస్వరూపానికి మాత్రమే పరిమితమై ఉంటుంది. బాహ్యస్వరూపము కేవలం ఒక ప్యాకేజి వంటిది. ప్యాకేజిని తొలగిస్తేగాని పదార్థము కనిపించదు. దైవత్వమనేది ఈ ప్రకృతిలో పంచభూతముల చేత కప్పబడి ఉంది. మానవుని ఆవరించిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యముల వలన కంటికి కనిపించకుండా ఉన్నది. ఈ ప్యాకేజిని తీసివేసిన, అప్పుడు నీకు చక్కని ఆనందమయమైన దైవస్వరూపం సాక్షాత్కరిస్తుంది. కేవలం 'పాకేజి' పైన దృష్టి పెట్టకూడదు. 'ప్యాకేజి' చాలా అందముగా ఉండవచ్చు. కాని, దానిని తెరచి చూస్తే తప్ప లోపలి వస్తువు ఎలా ఉంటుందో  ఎవరికీ తెలియదు. చాలామంది 'ప్యాకేజి'ని చూసి మోసపోతుంటారు. కాని, దివ్యత్వమునకు సంబంధించిన విషయం అటువంటిది కాదు. బాహ్యదృష్టికి భౌతికమైన దేహము, ఇంద్రియములు ఇవి మాత్రమే కనిపిస్తుంటాయి.

ఆ దేవదేవుని తత్త్వమే ఈవిధంగా దేహంలో 'ప్యాక్' చేయబడి ఉంది. కనుక, మనము ఈ ప్యాకేజిని మాత్రమే చూసి తృప్తిపడకూడదు. దైవత్వము మనయందే ఉన్నది. మనమే దైవత్వంగా ఉన్నాము. నీవే దైవం. దైవం సర్వ వ్యాపి. కాబట్టి నీవుకూడా సర్వవ్యాపివే. దైవత్వం నీయందు, సర్వదీవులయందుకూడను ఉంటున్నది. దైవత్వమును దర్శించాలంటే నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన జీవితాన్ని గడుపు. కంటికి కనిపించే భిన్నత్వమంతయు వ్యర్థమైనదే! భిన్నత్వమును దూరం చేసుకొని ఏకత్వమును అభివృద్ధి పరచుకో. 'యూనిటీ' ఉన్నచోట 'ప్యూరిటీ' ఆవిర్భవిస్తుంది. 'ప్యూరిటీ' ఉన్నచోట 'డివినిటీ' సాక్షాత్కరిస్తుంది.

మీరు ఈశ్వర నామస్మరణ చేయండి.

('శివ శివ అనరాదా..' పాట భక్తులచే భజన చేయించి, తరువాత దివ్యోపన్యాసము కొనసాగించారు)

'నమశ్శివాయ' ఇది ఐదక్షరముల మంత్రము. ఇది మహత్తరమైనది. పరిశుద్ధమైనది. 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం'. ఇట్టి తత్త్వాన్ని నీవు హృదయంలో పెట్టుకోవాలి. బ్రహ్మ సృష్టికర్త అని, విష్ణువు రక్షణకర్త అని, శివుడు లయకర్త అని' లోకములో బాహ్యమైన అర్థములు చెబుతూ వచ్చారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ వేరువేరు కాదు. ముగ్గురూ చేరి ఒక్కరే. నీవు తాంబూలం వేసుకోవాలంటే తమలపాకులు, వక్క సున్నం మూడూ కావాలి. ఈ మూడూ చేరినప్పుడే ఎరుపు రంగు వస్తుంది. ఈ ఎరుపు రంగు ఎక్కడనుండి వచ్చింది? తమలపాకులనుండి వచ్చిందా? వక్కనుండి వచ్చిందా? సున్నంనుండి వచ్చిందా? కాదు, కాదు. మూడూ ఏకం కావటంచేత ఎరుపురంగు ఏర్పడింది. అదేరీతిగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఏకత్వమే దైవత్వం. ఇట్టి దైవత్వాన్ని మీరు వేరువేరుగా భావించి మనస్సును చెడగొట్టుకోకండి. ఈ మూడింటియొక్క ఏక్యాన్ని తప్పక మీరు అనుభవిస్తారు.

ఒకానొక సమయంలోపార్వతి ఈశ్వరుని ప్రార్థించిందట ఒక ఇల్లు కట్టుకుందామని. 'ఊరూరు తిరుగుచు తిరిపమెత్తుటెగాని, ఇంటి పట్టున కూటికిరువ లేదు. తల దాచుకొనుట కొక ఇల్లు లేదు. ఇట్టి సంసారంబు నేనెట్లు చేతు?' అన్నదట. అప్పుడు ఈశ్వరుడు, 'పార్వతీ! ఇల్లు కట్టిన మాత్రాన ఏమియయ్యె? ఎలకలు మనకన్న ముందె చేరు. ఎలుకలను చంపుటకు ఒక పిల్లి.ఆ పిల్లిని సాకుటకు పాలు కావాలి. పాలు కావాలంటే ఒక ఆవు కావాలి. ఆ ఆవును కొనటానికి డబ్బులు కావలి కదా! ఇల్లు కట్టటం, సంసారం చేయటం అంటే ఏదో సామాన్యమైన విషయం

అనుకుంటున్నావు నీవు. కాదు, కాదు. ఇలాంటివి మనం ఆశించకూడదు. నీవు నన్ను ఇష్టపడిన తరువాత మిగిలినవన్నీ కోరకూడదు' అని చెప్పాడు.

ఈ ప్రపంచంలో ఉన్న ధనధాన్యకనకవస్తువాహనాదులన్నీ వ్యర్థమయ్యేవే. ప్రపంచంలో అనేక దేశాలను జయిస్తూ అలెగ్జాండరు గొప్ప సైన్యంతో భారతదేశానికి వచ్చాడు. కాశ్మీరు ప్రక్కనున్న సింధునది దాటటానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో అతనికి 'హార్ట్ ఎటాక్' వచ్చింది. వైద్యులు పరీక్షించి అతనింక బ్రతకాటానికి అవకాశం లేదన్నారు. అలెగ్జాండరు తన మంత్రులను, ఇతర అధికారులను సమావేశపరచాడు. 'నేను మరణిస్తున్నాన్న చింత నాకేమాత్రము లేదు. నేను ఆనందంగానే ఉన్నాను. అయితే, నాదొక్క చిన్న కోరిక ఉంది. నేను మరణించిన తర్వాత నా దేహాన్ని ఒక తెల్లని బట్టలో చుట్టి, చేతులు మాత్రం పైకి పెట్టి నా గ్రామంలో వీధివీధిలోను ఊరేగిస్తూ తీసుకు వెళ్ళండి. ప్రజలందరూ, 'ఎందుకు మహారాజు చేతులు పైకి పెట్టారు?' అని అడుగుతారు. 'అలగ్జాండరు చాలా గొప్పవాడు. ఆయనకు వేలాదిమంది సిపాయిలున్నారు. కావలిసినంతమంది బంధుమిత్రులున్నారు. ఆయన అనేక దేశాలను జయించి గొప్ప సిరిసంపదలను ఆర్జించాడు. కాని, తాను పోయే సమయంలో అంతా వదిలిపెట్టి వట్టి చేతులతోనే పోయాడు' అని చెప్పండి' అన్నాడు.

పోయేటప్పుడు ఒక నయాపైసాకూడా తీసుకుపోవటానికి వీలుకాదు. ఇంత మట్టినికూడా తీసుకుపోలేరు. మానవుడు తానెంతో గొప్పవాడినని, కోటీశ్వరుడనని భావిస్తాడు. మొన్న హైదరాబాద్‌లో ఒకాయన నలభైకోట్ల రూపాయలిచ్చి ఒక ఎకరం భూమి కొన్నాడు. ఆయన వెళ్ళి ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించి ఇంటికి తిరిగి వస్తుండగనే ప్రాణం పోయింది. ఎన్ని కోట్లు సంపాదిస్తే ఏమి ప్రయోజనం! మనకు గుణమే ప్రధానం కాని, ధనం కాదు. దైవబలమే మనకు ప్రధానం. దైవ భావమును అభివృద్ధి పరచుకుంటే సర్వము మనకు లభిస్తుంది. ధనము కూడా అవసరమే! తినటానికి తిండి ఉండాలి కదా! కాని, మితిమీరిన ధనము చాలా చెడ్డది. అది ఒక్కొక్కసారి ప్రాణంకూడా తీస్తుంది. మన కుటుంబ పోషణకు తగినంత డబ్బు మనవద్ద ఉండాలి. సమాజానికికూడను కొంతవరకు సహాయం చేయాలి. మనం సమాజములోనే జీవిస్తున్నాము. సమాజము లేకపోతే మనం లేము. కనుక, సమాజానికి కృతజ్ఞత చూపాలి. మొదట 'సెల్ఫు', ఆపైన సమాజానికి 'హెల్పు'. ఈ రెండూ ఉంటుంటే మానవత్వము జీవిస్తుంది. 'సెల్ఫిష్'గా (స్వార్థం)గా ఉండకూడదు. మనము నిస్వార్థంగా ఉంటూ జీవితాన్ని ఆనందంగా గడుపుతూ పోవాలి.

నేనెప్పుడూ ఆనందంగా ఉంటాను. దుఃఖమంటే ఏమిటో, బాధ అంటే ఏమిటో నాకేమీ తెలియదు. ఇండియా ప్రెసిడెంటు వచ్చి, 'మీకూ ఏమైనా కోరికలున్నాయా? స్వామీ!' అని అడిగాడు. 'నేను కోరేది ఒక్కటే' అన్నాను. 'నేను నేననుగా ఉండాలి. ఇతరులపై ఆధారపడి ఉండకూడదు. అందరినీ సంతోషపెట్టాలి. అందరూ ఆనందంగా ఉన్నప్పుడే నేనూ ఆనందంగా ఉంటాను. ఇంతకంటె కావలసింది ఏముంది!' అందరూ శాంతి కావాలని అడుగుతారు. కాని, శాంతి ఎక్కడుంది? మనలోనే ఉంది. బయట ఉన్నదంతా పీసెస్. అది మనకక్కర్లేదు. శాంతిని మననుండే ఆవిర్భవింప చేసుకోవాలి. ఆవిధమైన జీవితాన్ని గడిపినప్పుడే మన జన్మ ధన్యమవుతుంది. ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని గ్రంథములు చదివినా, ఎన్ని పి. హెచ్‌డి.లు చేసినా అందరూ కట్టకడపటికి అన్నీ వదలిపెట్టి పోయేవారే. కాబట్టి, అందరూ ప్రశాంతంగా జీవితాన్ని గడపాలి. శాంతిని కోరండి. మీరు శాంతిని కోరాలన్నదే నా కోరిక. ధన, ధాన్యములు కలిగినప్పటికీ ధర్మగుణము లేకపోతే ప్రయోజనమేమిటి?

ఇక్కడి వేదనారాయణ ఉన్నాడు. కాని, వాని పేరే వేదనారాయణ. వేదములో చాలా ఆరితేరినవాడు. గత సంవత్సరము ప్రెసిడెంటు అవార్డును గెల్చుకున్నాడు. ఆయన, 'నీ అవార్డు తీసుకొని ఎక్కడికి పోతావు?' అని అడిగాడు. 'నేను పుట్టపర్తి వెడుతున్నాను. పుట్టపర్తిలోనే సెటిల్ అయిపోయాను. నేనెక్కడికీ పోను' అన్నాడు. అప్పుడాయన చెప్పాడు, 'చాలా మంచి పిల్లవాడవు. నీవక్కడే ఉండు నాయనా!' ప్రెసిడెంటు మహమ్మదీయుడు. అయినప్పటికీ ఆయనకు స్వామి అంటే చాలా భక్తి. ఇలాంటి పెద్దలు అనేకమంది ఇక్కడికి వచ్చి మా పిల్లలను చూసి గొప్పగా వర్ణిస్తుంటారు.

మా కాలేజీలో ప్రతి సంవత్సరము ఐదు వందలమంది పిల్లవీంటారు. మేము పేపర్లో వేసుకోముగాని, ప్రతి ఒక్కరికీ ఫస్టు క్లాసే! అళికెలో చదివిన ఇద్దరు పిల్లలకు మెడికల్, ఇంజనీరింగు ఎంట్రన్స్ టెస్టుల్లో ఫస్టు ర్యాంకులు

వచ్చాయి. వారిద్దరికీ స్కాలర్‌షిప్‌లు యిచ్చాను. వారిని అమెరికాకు పంపాలంటే ఆ భాధ్యతను నేను తీసుకున్నాను. 'ఇక్కడే కాదు, అమెరికాలో కూడా మీకు ఫస్టు క్లాసు రావాలి' అని చెప్పి పంపించాను.

మా పిల్లలందరూ బంగారువంటి పిల్లలు. కల్తీ బంగారం కాదు. ప్యూర్ గోల్డు! ఎటువంటి పని చెప్పినా చేయటానికి సంసిద్ధులై ఉంటారు. వీళ్లు ప్రతి సంవత్సరం ఒక నెల పల్లెల్లో తిరిగి సేవ చేస్తుంటారు. అన్నం వండి, సాంబారు కలిపి అందరికీ పెడుతుంటారు. ఒక్కొక్క ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ పెడుతుంటారు. మా పిల్లల్ని చూసి పల్లెలవారంతా, 'మా స్వామి పంపించారమ్మా మిమ్మల్ని' అంటూ ఎంతో ఆనందిస్తుంటారు. మా పిల్లలు వచ్చే రోజున వాళ్లు తమ ఇల్లంతా అలికి, ముగ్గులు వేసుకుంటారు. స్వామి ప్రసాదాన్ని కళ్లకద్దుకొని స్వీకరించి, ఆనందముగా భుజిస్తారు. మళ్ళీ త్వరలోనే పిల్లలను ప్రసాదం పంచటానికి పల్లెలకు పంపించాలి. మా పిల్లలు కేవలం చదువులోనే కాదు, ఆటపాటలందు, సంగీత నృత్యములందు కూడను ఆరితేరినవారు. మా పిల్లలు చేయలేని పని ఏ ఒక్కటీ లేదు. పల్లెల్లోగాని, పట్టణాల్లోగాని ఎక్కడికి వెళ్ళినా తమ 'కేరక్టర్' విషయంలో అతి జాగ్రత్తగా ఉంటారు. ఆడపిల్లలు, మగపిల్లలు 'కేరక్టర్'ని ప్రాణప్రదంగా భావిస్తారు.

అనంతపురంలో 700మంది ఆడపిల్లలున్నారు. అక్కడకూడా వాళ్ళు ఫస్టుక్లాసులో ఉత్తీర్ణులవుతున్నారు. వాళ్ళు ఆడపిల్లలైనప్పటికీ సేవ చేయటానికి పల్లెలకు పోతుంటారు. పాత ఇళ్లు పెరికివేసి కొత్త ఇళ్లు కట్టించి వస్తున్నారు. ఆడపిల్లలే స్వయంగా రాతితో ఇళ్లు కట్టి, మంచి పైకప్పు వేసి బీదలకు ఎంతో సహాయం చేశారు. 'మీ ఇళ్లు ఏమైనా కారుతున్నాయా?'అని అడిగితే, 'లేదు స్వామీ! మీ పిల్లలు ఎంత భద్రంగా చేశారు! ఇంజనీర్లుకూడా చేయని పనిని మీ పిల్లలు ఉచితంగా చేశారు' అన్నారు. మా మగపిల్లలుకూడా అంతే! అనంతపురం, బెంగుళూరు, పుట్టపర్తి ఈ మూడూ కేంపస్‌లనుండి పిల్లలు గ్రామాలకు వెళ్ళి గ్రామస్థులకు తగిన రీతిగా సహాయం చేస్తున్నారు. మా పిల్లలు ఇక్కడికి కేవలం చదువుకోసమని వచ్చినవారు కాదు. ఎవరైనా సరే, కేవలం చదువుకోసం రావద్దండి. మీకు టైమ్ చిక్కినప్పుడు తప్పకుండా చదువుకోవచ్చు. కాని, మీరు ముఖ్యంగా చేయవలసినది సేవ. భగవంతుడు మీకు శరీరమునిచ్చినది సేవ కోసమే. కృష్ణుడు చెప్పాడు, 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః', అందరూ భగవంతుని అంశమే. కాబట్టి, మీరు అందరికీ సేవ చేయాలి. Service is God. Serve all. ఈవిధమైన స్వామి బోధలను ఆచరణలో పెట్టి మా పిల్లలు చక్కని పేరు తెచ్చుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినప్పటికీ సత్యసాయి పిల్లలంటే ప్రజలకు ఎంతో అభిమానం. తెల్లని దుస్తులు ధరించి మా పిల్లలు కనబడితే చాలు, 'వీళ్లంతా సత్యసాయి పిల్లలు చాలా మంచివారు' అని కొనియాడుతారు. మా పిల్లలు ధరించే దుస్తులూ తెలుపే, వారి హృదయాలు కూడా తెలుపే, చాలా పవిత్రమైనవి.

మీరు ప్రతి దినం చూస్తూనే ఉన్నారు, ఈ పిల్లలు నన్ను ఏవిధంగా పట్టుకొని వస్తున్నారో! ఏవిధంగా తీసుకొని వెళుతున్నారో! వీరిరువురూ ఎమ్.బి.ఎ. పూర్తి చేశారు. మూడవ పిల్లవానిని ఎమ్.బి.బి.ఎస్.లో చేర్చినాము. ఆదికేశవులు వైదేహి మెడికల్ కాలేజీలో ఇతనికి సీటిచ్చాడు. ఇటువంటి పిల్లలెందరికో ఆయన సీట్లిస్తున్నాడు. బయట ఎక్కడైనా మెడికల్ కాలేజీలో సీటు కావాలంటే పెద్దమొత్తంలో ఫీజు కట్టాలి. అంతేకాకుండా, నెలకు మూడువేల రూపాయలు కట్టాలి. కాని, ఆయన మా దగ్గర నయాపైస తీసుకోలేదు. ఈవిధంగా మా పిల్లలెందరినో చేర్చుకున్నాడు. ఆయనొక గొప్ప త్యాగి. బెంగుళూరులో శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌కి దగ్గరలోనే ఆయన ఉంటున్నాడు. బెంగుళూరులో ఉన్న మా హాస్పటల్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే పరికారాలున్నాయి. బయటి పాస్పటల్‌లో హార్ట్ ఆపరేషన్ చేయించు కోవాలంటే లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అనేకమంది బీదలు మన హాస్పటల్స్‌కి వచ్చి ఉచితంగా ఆపరేషన్లు చేయించు కుంటున్నారు.

విద్య, వైద్యము, ప్రాణాధారమైన నీరు ఈమూడు ప్రజలకు ఉచితంగా అందించాలని నేను సంకల్పించుకున్నాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కొండలపైకి కూడా పైపులు ఎక్కించి అనేక గ్రామాలకు నీరు సప్లై చేస్తున్నాము. ఆ రెండు జిల్లాల్లో కావలసినంత నీరు పారుతున్నాది. కాని, మెట్టప్రాంతాల వారికి ఆ నీరు అందటం లేదు. ఇంతకాల మైనప్పటికీ వాళ్లు నీటి సమస్యతో బాధపడుతూనే ఉన్నారు. మేము 80కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పైపులు వేయించి

వాళ్లందరికీ నీరు సప్లై చేస్తున్నాము. 'మేము తియ్యని నీరు త్రాగి ఎన్నో సంవత్సారాలైంది. ఈనాడు మళ్లీ మేము పరిశుద్ధమైన నీటిని త్రాగుతున్నాము. మాకు చాలా ఆనందంగా ఉన్నది, స్వామీ!' అంటున్నారు వాళ్ళు.

అంతేకాదు. మద్రాసు నగరంలో కూడా అందరికీ నీరిచ్చాము. బీద, గొప్ప అనే భేదం లేదు. వాళ్లకి నీరిచ్చిన తరువాత మద్రాసు ప్రజలు యాభై బస్సుల్లో పుట్టపర్తికి వచ్చారు. 'స్వామీ! మేము ఎట్లా కృజ్ఞతలు చెప్పాలి!' అన్నారు. 'మీరు నాకు కృతజ్ఞతలు చెప్పనక్కర్లేదు. నా వారికి నేను ఇచ్చుకున్నాను' అన్నాను. మీరు ఇక్కడున్నారు కాబట్టి, మీకు తెలియకపోవచ్చు. నిన్న గాక మొన్నటి దినము పేపర్లో వేశారు. పూండినుండి మద్రాసుకు నీరు సరఫరా చేశారు. నిన్నటి దినమే మంచి టైమ్‌కు మద్రాసు చేరినాయి నీళ్లు.

మహబూబ్ నగర్, మెదక్ జిల్లాలవారు వచ్చారు. 'మీకేం కావాలి?' అని అడిగాను. 'మాకు త్రాగు నీరు లేదు, స్వామీ!' అన్నారు. కృష్ణానదినుండి వాళ్లకి నీటిని సప్లై చేయించాను. ఈవిధంగా, అన్ని దేశాలకు, అన్ని ప్రాంతాలకు, అన్ని పల్లెలకు మేము సేవలు చేస్తున్నాము. అందరికీ సేవలు చేయాలి. మా పిల్లలందరికీ నేను బోధించేది ఇదే! ఎవరైనా బాధలో ఉన్నట్లు మీ దృష్టికి వస్తే అతను మీ మిత్రుడు కాకపోయినా సరే, అతనికి సేవ చేయాలి. అవసరమైతే ఆ రోజున కాలేజీకి సెలవు పెట్టి అయినా అతనికి సేవ చేయి.

మా పిల్లల గురించి నేను చెప్పుకోకూడదు కాని, నేను చెప్పినదానికంటే ఎంతో ఎక్కువగా పని చేస్తున్నారు. తమ స్వార్థాన్ని త్యాగం చేసి ఇతరులకు సహాయపడుతున్నారు. ఈవిధమైన త్యాగభావం, సేవానిరతి కలిగిన పిల్లల్ని మేము తయారు చేస్తున్నాము. వారు అన్ని రంగాల్లో దినదినాభివృద్ధి నొందుతున్నారు.

ప్రైమరీ స్కూల్లో చిన్నచిన్న పిల్లలు పన్నెండువందల మంది ఉన్నారు. తల్లిదండ్రులను విడిచిపెట్టి ఉండలేని పిల్లలు ఇక్కడికి వచ్చి చేరుతున్నారు. రెండు దినములలోనే వాళ్ళు తమ తల్లిదండ్రులను మరచిపోయి మమ్మల్ని విడిచిపెట్టి ఉండలేని స్థితికి వస్తున్నారు. తల్లిదండ్రులు ఇక్కడికి వచ్చి చూసి, 'ఆహా! మా పిల్లల్లో ఎంత మంచి మార్పు వచ్చింది!' అని ఆనందిస్తుంటారు. తల్లిదండ్రులకంటే అధికమైన ప్రేమను పిల్లలపై చూపుతున్నాము.

మా పిల్లల విషయంలో ఎంతైనా చెప్పవచ్చు. వాళ్ళని మీరు సామాన్యులుగా భావించకండి. వాళ్లెంతో గొప్పవారు. దేశానికి నాయకులు కావలసినవారు. పిల్లలు ఆదర్శప్రాయులు కావలి. అప్పుడే నాకు సంతోషం. (అతిరుద్రమహాయజ్ఞం సందర్భముగా స్వామివారి దివ్యబోధ. 08162006, సాయికుల్వంతె, ప్రశాంతినిలయం.)